ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (దువ్వలో శ్రీ నాన్న గారి ప్రవచనము, 29-1-1998)

**ప్రియమైన ఆత్మబంధువులారా,**

మీకు జ్ఞానం వస్తుందా, రాదా అని సందేహం పెట్టుకోవద్దు. అందరికీ జ్ఞానంవస్తుంది. జ్ఞానానికి అందరూ వారసులే. ఇందులోసందేహంలేదు. మీరు చేసేశ్రవణానికి, మీరు చేసే జపానికి మీరు చేసే సాధనకు ముగింపు జ్ఞానం, ప్రయత్నానికి ముగింపు మోక్షం. కొంతమంది మనస్సుకు మసి ఉంటుంది. మన మొఖానికి మసి అంటుకొంది అంటేకంగారుపడతాము. కాని మన మనస్సుకు మసి ఉంది అంటే కంగారు పడటంలేదు. మనస్సుకు మసి ఉంటే బ్రహ్మభావము కలుగదు. మనస్సులో ఉన్న కల్మషాన్ని తొలగించటానికే సాధన. ఒక్క మనప్రయత్నం వలననే కల్మషాన్ని తొలగించు కోలేము. సాధన అవసరం. సాధనవలననే పని పూర్తి అవ్వదు. ఈశ్వరునికృప, గురువు అనుగ్రహం అవసరం.

జన్మలు మారటంవలన దుఃఖం, అశాంతి నశించదు. దుఃఖం నశించాలంటే జ్ఞానం రావాలి. చనిపోవటం వలన దుఃఖం ఆగదు. మరల కొత్త శరీరం వస్తుంది ఆ శరీరంలో దుఃఖం, అశాంతి ప్రారంభమవుతాయి. ఈ అశాంతికి, దుఃఖానికి, సుఖానికి, లాభనష్టాలకు, ఈద్వైతస్థితికి ఒక ముగింపు ఉంది. అదే మోక్షం, అదేజ్ఞానం శరీరం మారిపోతే దుఃఖం ఆగిపోతుంది, కష్టాలుపోతాయి అని అనుకోవద్దు. జ్ఞానంవచ్చే వరకూ ఏదోరూపంలో ప్రతీ శరీరంలోనూ కష్టం ఉంటుంది. ఈబాధలు ఇలాగే ఉంటాయి అనుకోవద్దు. ఈబాధలకు ఒకపరిష్కారమార్గం ఉంది. అదేజ్ఞానం చావుపుట్టుకలకు ముగింపు జ్ఞానం. మన హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. ఇతరవిషయాలను చింతించకుండా నిరంతరము ఆవస్తువునే చింతిస్తూ ఉంటే ఈజన్మలోనే మనం దానిలో ఐక్యమవుతాము నిరంతరము ఆవస్తువును చింతించకుండా మనమనస్సులో లోపాలు అడ్డువస్తున్నాయి.మనంకంగారు పడకుండా ఆలోపాలను తొలగించమని ఈశ్వరుని ప్రార్థించాలి. కానిమనం అలా ప్రార్థించము. ఆకోరిక తీర్చమని, ఈకోరిక తీర్చమని అడుగుతాము. అదితప్పు అనికాదు, అదిసాధకుని లక్షణం కాదు. సాధకుడు ఏమిచేస్తాడు అంటే నీస్వరూపం నాకు కావాలి, నీవు ఏచైతన్యస్థితిలోఉన్నావో అదినాకు కావాలి. అదినాకు రావటంలేదు అంటే నాలో ఏవోలోపాలు ఉన్నాయి. నీయొక్కసహకారం లేకుండా వాటిని నేను తొలగించుకోలేను. ఆలోపాలను తొలగించి నీస్వరూపాన్ని నాకు ఇయ్యి అనిసాధకుడు ప్రార్థిస్తాడు. ఎవరు ఏమార్గంలోప్రయాణం చేసినా త్రికరణశుద్ధిగా నన్నే పొందాలని అనుకొంటే వారిని నాలో ఐక్యం చేసుకొంటాను అని కృష్ణుడు గీతలో చెప్పాడు.

నీ హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది. ఆవస్తువును enjoy చేయటం నేర్చుకో. నీకు శాంతి కావాలి అంటే ఆవస్తువు మీద గురిపెట్టు. నీకు ఇష్టమైన వస్తువును తినేటప్పుడు నీకు ఎంత ఆనందంగా ఉంటుందో నీహృదయంలో ఉన్నసత్యవస్తువు జ్ఞాపకం వచ్చేటప్పటికి నీకు అంత మధురంగా ఉండాలి

అప్పడు ఆవస్తువు గురించి నీకు తెలుస్తుంది. కళ్ళుమూసుకొని కూర్చోవటం, గంటలు కొట్టటం సాధనకాదు. సాధన అంటే మీలో మంచివాసనలు ఉంటాయి, చెడువాసనలు ఉంటాయి. మంచి వాసనలను జాగ్రత్తగా పోషించుకొంటూరావాలి, చెడు వాసనలను తగ్గించుకొంటూ రావాలి. మంచి వాసనలు కూడా మనస్సులోనివే అయినా మంచివాసనలు సత్యవస్తువును తెలుసుకోవటానికి నీకు సహకరిస్తాయి కాబట్టి మంచి వాసనలు పెంచుకోవాలి. నీవు సాధనచేసి, గురువును ఆశ్రయించి నీ లోపల ఉన్న కల్మషాన్ని అంతా పోగొట్టుకొంటే నీకు ఆత్మభావన కలుగుతుంది. నీకు ఆత్మభావన కలిగిన తరువాత వైకుంఠం ఎక్కడ ఉంది, శాంతి ఎక్కడ ఉంది అని నీవు వెదుక్కోనక్కరలేదు. వైకుంఠమే నీ దగ్గరకు వస్తుంది, నీవు ఊహించనటువంటి శాంతి, సుఖం వచ్చి నిన్నువరిస్తాయి.

అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతోంది అనేవిషయం మీకు బాగా అర్థమయితే నిప్పమీద నీరు పోస్తే వెంటనే ఎలా ఆరిపోతుందో అలాగ నీ దుఃఖం అంతా వెంటనే చల్లారిపోతుంది. భగవంతుడు ఏది అయితే మంచి అని చెప్పాడో, భగవంతుడు ఏదైతే సంకల్పించాడో దానికి వ్యతిరేకంగా ఉండవద్దు. దానికి సహకరించటం సాధనతో సమానము. భగవంతుడు ఏదైతే మంచి అని చెప్పాడో దానిని ఆచరించండి. అప్పడు భగవంతుని మాటను, భగవంతుని సంకల్పాన్ని గౌరవించినట్లు అవుతుంది. అప్పడు భడవంతుని అనుగ్రహానికి పాత్రులవుతారు. నీ శరీరం ఎక్కడ ఉన్నా నీ శరీరం ద్వారా భగవంతుడు ఇచ్చిన పనిని చెయ్యి. ఆ పనిలో కలిసి పోకుండా పరమాత్మను ధ్యానం చేస్తూఉండు ఏపని చేస్తున్నా ఎరుక కలిగి ఉండు. పరమేశ్వరుని మరువకు. భగవంతుని స్మరించగా, స్మరించగా మనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలం అవుతుంది, అకల్మషస్థితికి ఎదిగి వెళ్ళిపోతుంది, శాంతి కలుగుతుంది.

మనకు బాగా ఇష్టమైనవారు కనిపించారు అనుకోండి ఆప్యాయతతో ఒక్కసారి కౌగిలించుకొంటాము, తరువాత విడిచి పెట్టేస్తాము. కాని ఆత్మ ఒక్కసారి మిమ్మల్ని కౌగిలించుకొంటే అలావిడిచిపెట్టదు. మీలోని జీవలక్షణాలను తొలగించి తన స్వరూపాన్ని ఇచ్చే వరకూ కౌగిలివిడిచిపెట్టదు. మన బంధువులు, స్నేహితులు మనతో మాట్లాడకపోతే మనకు భయం కలుగుతుంది. భగవాన్ అరుణాచలం వచ్చినప్పడు అక్కడ బంధువులు లేరు, స్నేహితులులేరు. బాహ్యంగా సపోర్టుఇచ్చేవారు ఎవరూ లేరు, నీడ లేదు. కాని బంధువులు లేరు, నీడలేదు అనే గొడవ ఆయనకు లేదు. ఎందుచేత ? ఆత్మచింతన తప్ప ఇంకో చింతన ఆయనకులేదు. మనకు ఇతర చింతనలు వచ్చినప్పడు బంధువులు అని, స్నేహితులు అని, గౌరవాలు అని ఇలా చిల్లర గొడవలు అన్నీ వస్తాయి. ఆత్మధ్యాసలో ఉన్నప్పడు ఇతర చింతనలు పుట్టటానికి ఆస్కారం లేదు. అందువలన ఏగొడవ లేదు. కోరిక వచ్చిన తరువాత జయించటంకంటే కోరిక ఉదయించకుండా చూసుకోవాలి. కోరిక ఉదయించకుండా చూసుకోవాలి అంటే ఆత్మను కౌగిలించుకోవాలి, నిరంతరం ఆత్మధ్యాసలో ఉండాలి.

ఏదైనా మంచి పనిచేసావుఅనుకో, నేను చేసాను, నేనుచేసాను అనుకోవద్దు, ఆ పని చేయాలనే బుద్ధిని ఆత్మ ఇచ్చింది కాబట్టి నేను చేసాను లేకపోతే నేను ఏమి చేయగలను అనుకో. మీకు

తలంపువచ్చాక పని చేస్తారు ఆ తలంపు కలుగ జేసింది ఎవరు ? ఆత్మ కలుగజేసింది. అంటే ఆ పని చేసింది ఎవరు ? ఆత్మ ఆపని చేసినట్లు. మరి నేను చేసాను అంటావు ఏమిటి ? పని చేసింది నేనే అని ఊహించుకోవద్దు నీలోపల ఒక జ్ఞానవాహిని ఉంది. అది పని చేస్తోంది. నీవు దేహంతో తాదాప్యం పొందేబదులు నీలోపల ఉన్న జ్ఞానవాహినితో తాదాప్యం పొందు. సన్యాసం అనేది బట్టలలోలేదు, దేహంలో లేదు. మీ ఇంట్లో వ్యక్తులను ప్రేమగా చూడండి మంచిదే కాని ఇది నాకుటుంబం కాదు, దేవుని కుటుంబమే. దేవుడే దీనికి యజమాని అనే భావనతో చేయండి. ఆ భావన నీ మనస్సులో వస్తే నీవు నిజమైన సన్యాసివి. మన సాధనకు ముగింపు మోక్షము, సాధనకు ముగింపు అయిన మోక్షమును పొందే వరకూ సాధన ఆపకూడదు. అంటే ప్రయత్నం విడిచి పెట్టకూడదు.

## (గుమ్మలూరు లో శ్రీ నాన్న గారి ప్రవచనము, 1-2-98)

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

భగవంతుడు సర్వశక్తిమంతుడు. ఈ సృష్టి అంతా కూడా భగవంతుని ఆధారంగా చేసుకొని ఉంది. ప్రాణంలేని శరీరానికి ఎటువంటి గతిపడుతుందో ప్రపంచానికి ఆధారంగా ఉన్న వస్తువులేకపోతే ఈప్రపంచానికి కూడా అటువంటి గతే పడుతుంది. దేని ఆధారం మీద ఈసృష్టి అంతా ఉందో అదే లేదని మనం అనుకొంటున్నాము ఎవరికైతే ప్రజ్ఞ ఉందో, ఎవరికైతేవివేకం ఉందో, ఎవరికైతే పవిత్ర మానసం ఉందో వారు ఆ వస్తువును స్పష్టంగా చూడగలరు. మన మనస్సులో ఉన్న కల్మషం వలన మనకు భగవంతుడు ఉన్నాడనే గుర్తింపు రావటంలేదు, ఆయన మీద ప్రేమ, విశ్వాసం కలగటంలేదు. ఎవడైతే అకల్మషస్థితిని సంపాదించాడో వాడికి ప్రకృతికి అతీతమైన సుఖం, శాంతి దొరుకుతుంది. లోపల కల్మషం పెట్టుకొన్నవాడికి శాంతి ఏమిటి? సుఖం ఏమిటి? అని భగవంతుడు గీతలో చెప్పాడు ఈ కల్మషం తొలగించుకోవటానికే పూజలు, జపాలు, ధ్యానాలు. ఈకల్మషానికి మన అహంకార బుద్ధేకారణం, ప్రతీ మనిషి వాడి కోణంలో నుండి చూస్తాడు. అలా కాకుండా భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకోవాలి. ఎవరో బంధువులు, స్నేహితులు చెప్పిన దానిని తీసుకోవద్దు. అహంకారము ఉన్నవాడికి బంధువులు, స్నేహితులు, విరోధులు కాని భగవంతునికి స్వపర బేధం ఉండదు. అర్జునుడికి స్వపర బేధం ఉంది కాబట్టి పనిచేయమన్నాడు. పనిచేస్తూ స్వపర బేధం అంటే నీవు నేను అనే బేధబుద్ధిని పోగొట్టుకోమని చెప్పాడు. పనిచేస్తూ ఉంటే మనలోని బలహీనతలు తెలుస్తాయి. పనిచేస్తూ బేదబుద్ధిని తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. అప్పడు నీవు యోగివి అవుతావు.

రావణాసురుడు సీతతో నీవు నిరంతరము రాముడిని స్మరిస్తున్నావు. కుబేరుడు, ఇంద్రుడు కూడా అసూయపడే అంత సంపద నా దగ్గర ఉంది. ఈ సంపద, వైభవం నిన్ను ఆకర్షించటం లేదు. రామ, రామ అని నిరంతరము స్మరిస్తున్నావు అది నీ అజ్ఞానికి గుర్తు అన్నాడు. అంటే వాడి కోణంలో వాడు చెప్పాడు. ఇప్పడు మనం ఒక మార్గంలో ప్రయాణం చేస్తున్నాము అనుకోండి. ఆ మార్గం నచ్చని వారికి మనం అజ్ఞానంలో ఉన్నాము అనిపిస్తుంది. మనం ఏమి చేయాలి అంటే భగవంతుడు ఒక

మాట చెపితే మన అజ్ఞానం వేరేవిధంగా చెపుతూ ఉంటే మన అజ్ఞానం చెప్పిన మాటను ప్రక్కనపెట్టి భగవంతుడు చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకోవాలి. నేను నీ హృదయంలో ఉన్నాను నన్ను తెలుసుకొని మోక్షాన్ని పొందు అని భగవంతుడు చెపుతూ ఉంటే హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవటంమానివేసి పూర్వజన్మలు, రాబోయే జన్మలు గురించి ఆలోచిస్తావు ఏమిటి ? నీహృదయంలో ఉన్న వస్తువును తెలుసుకొంటే ఇంక శవాలను మోయనక్కరలేదు. వస్తువు అత్యంత సమీపంలో నీ హృదయంలో ఉంది. కాని మన మనస్సులో ఉన్న కల్మషం వలన అది మనకు అనుభవంలోనికి రావటం లేదు. నీవు సాధన చేయటానికి ఈ కల్మషం అడ్డువస్తోంది. మంచి మాటలు శ్రవణం చేయగా చేయగా ఆ వస్తువును పొందాలి అనే కాంక్ష కలుగుతుంది. పుస్తకాలు చదవటం వలన జ్ఞానం రాదు. మీరు చదివే చదువు వలన మోక్షంరాదు. భగవంతుడు ఇచ్చే జ్ఞానం వలన మీకు మోక్షం కలుగుతుంది. రమణమహర్షికి, రామకృష్ణుడికి బాహ్యంగా చదువు ఏమి ఉంది, కాని వారు మహా గురువులు అయిపోయారు, ఎందువలన అంటే భగవంతుడు వారికి స్వయంగా జ్ఞానాన్ని ఇచ్చాడు అయితే భగవంతుడికి పక్షపాతం ఉందా ? భగవంతుడికి పక్షపాతం లేదు. వారికి ఉన్న సహృదయంచూసి, వారు పూర్వజన్మలలో చేసిన కృషిని చూసి, వారుపడిన తపన చూసి భగవంతుడు వారికి స్వయంగా జ్ఞానాన్ని ఇచ్చి, జ్ఞానం ద్వారా మోక్షాన్ని ఇచ్చాడు.

మనం ఎక్కువ దోషాలు చేస్తూ ఉంటే ఆ దోషాలు మనస్సును బాహ్యముఖానికి తీసుకొని పోతాయి. మనం ఎక్కువ మంచి పనులు చేస్తూ ఉంటే ఆ మంచి పనులు మనస్సుకు అంతర్దృష్టి ని కలుగజేస్తాయి. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా, మీరు ఏ మతస్థులు అయినా మీ మనస్సుకు అంతర్దృష్టి కలుగకుండా మీ లోపల ఉన్న దేవుడు మీకుకనబడడు. మీకు అంతర్దృష్టి లేకపోతే మీరు కోటి జన్మలు ఎత్తినా మీ లోపల ఉన్న దేవుడు మీకు తెలియబడదు. కోరిక, కోపం, ఆశ, ఇవి మూడు మన చేత చెడ్డపనులు చేయిస్తాయి. కొంత మందికి నోరు సూది బెజ్జం అంత ఆశ ఆకాశం అంత ఉంటుంది. మనకు ధనం వచ్చిన, విద్య వచ్చిన ఏది అయినా మనం పూర్వజన్మలో చేసిన కృషిని బట్టి మన అర్హతను బట్టి ఇవి అన్నీ వస్తాయి గాని మనకు ఆశ ఎక్కువ ఉన్నంత మాత్రం చేత ఎక్కువ రావు. కొంతమందికి కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ఎప్పడూ సమానంగా ఉంటారు. వారికి ఆలోచనే ప్రధానంగాని అహంకారము ప్రధానం కాదు. మనస్సు చుట్టూ తిరగరు. భగవంతుడు లోపల ఉన్నాడు. ఏ జన్మకు ఆ జన్మ నీమనస్సు బయటకు వెళుతూ ఉంటే ఇంక నీకు లోపలఉన్న వస్తువు ఎలా తెలుస్తుంది. ఏ కారణముల వలన నీ మనస్సు బాహ్యముఖం అవుతోందో ఆ కారణములను తొలగించి నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగజేసే వాడే గురువు. మాకు శాంతి లేదు అంటారు. అహంకారము, మమకారము ఉన్నంతవరకూ ఎవరికి శాంతి ఉండదు. వాటిని ఎవడైతే విడిచిపెడతాడో వాడికి శాంతి కలుగుతుంది. మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు పాత సంస్కారములు తగ్గించుకోవాలి, కొత్త సంస్కారములు రాకుండా చూసుకోవాలి. ఆరకంగా జీవించటానికి ప్రయత్నం చేయాలి.